తెలివి మీరిన వారి మధ్య, బలవంతుల మధ్య యువతీయువకులు ఎలాంటి చిత్ర విచిత్రమైన సమస్యలను ఎదుర్కోనవలసి వస్తుందో చాటి చెప్తూనే, సమస్య ఎంతటి జటిలంగా కని పించినా కుంగిపోరాదని ఎమ్.వి.వి. తన రచనలలో హెచ్చరిస్తారు.

# నిజంగా పులే

మరణం ఒక శాపమైతే మరణానికి దారుణాతి దారుణంగా విలపించడం అంత కంటె ఘోరమైన అభిశాపం

చిత్రాలు: పి.యస్. బాబు



చెట్టుచాటునుండి మరోసారి అటు చూశాడు మురారి. మురారికి పదిహేను, ఇరవై గజాల్లో తారు రోడ్డూ, రోడ్డుకి అంచులో పిట్టగోడా; గోడకి అవతల మొక్కల తలలూ కనిపిస్తున్నాయి. మొక్కల తలలు దాటితే ఖాళీ.

పిట్టగోడ వర్తులంగా ఉన్నట్లు నెలవంక వంపు తిరిగి అంచులు మాయమవుతున్నాయి. పిట్టగోడకు అవతల అంతులేని ఖాళీ. మొక్కలు అగాధం అంచుల్లో పెరిగాయి. పిట్టగోడ మీద తెల్లటి సున్నపు పట్టీలూ, వాటి మధ్యలో తారు పట్టీలూ అమరిపోయి ఆ గోడకి ఒక రకమైన సర్కారీ కళ వస్తోంది.

మురారి నవ్వుకున్నాడు.

పిట్టగోడకు సర్కారీ కళ వచ్చి ఉంటే తనకి చావు కళ వచ్చినట్లే. నిజంగా చావు కళే!

చావు కళ!

తమ ఇంటికి మామయ్య వచ్చాడు. ఈ రోజుకి ఆయన వచ్చి పదిహేనో రోజు. పదకొండో రోజున కార్యమైపోయాకనే వెళ్లిపోవచ్చు కదా! మిగతా బంధువులు వెళ్లిపోలేదా? మేనమామకేం వచ్చింది? నిలబడిపోయాడు.

అందుకు సంజాయిషీ కూడా ఆయనే ఇచ్చుకున్నాడు.

''నాకెక్కడ కుదురుతుందీ? మిగతావాళ్లంటే పెద్ద కార్యం కాగానే లేచి చక్కాపోయారు. నాకలా అవుతుందా? ఒక్కనాటికీ కాదు: నా తోడబిడ్డకు పసుపు కుంకుమలు చెరిగిపోతే నేను అంత చవ్వున ఏ రకంగా తెంచుకు రాగలను'' అంటూ తనను బయల్దేరతీయాలని చూసిన బంధువులను సాగనంపాడు.

తానూ, చెల్లీ ఆయన వైపు తేరిపార చూశారు.

పెద్ద కార్యం నాటికి ఆయన తమ ఇంటికి వచ్చి అచ్చంగా పదకొండు రోజులే గడిచాయి. ఆయన చలాయించిన అజమాయిషీ మాత్రం పదకొండు సంవత్సరాలకు సరిపడేది.

ఆయన వస్తూనే శవం చుట్టూ చేరిన బంధువులను చెదరగొట్టేశాడు.

''ఏం తమ్ముడూ? అరె పెద్దోడా! నువ్వు కూడా మా బావ శవం దగ్గర చేరి ఏం చేస్తున్నావయ్యా? అదిగో గదిలో ఒకమూల చేరి దిక్కుతోచకుండా పోయి కుమిలి పోతోందే మా అక్కయ్య. ఆవిడ్ని ఓదార్చండయ్యా. మీకు పుణ్యముంటుంది. వెళ్లండి బాబూ. కడసారి చూపులకు వచ్చిన వాళ్లు మాత్రమే ఇక్కడుంటారు. వెళ్లండయ్యా... మీక్కాదూ చెప్పేది.''

ప్రజల్లో ఎక్కువమందిది గొర్రె దాటు మనస్తత్వం. ఎవడో ఒకడు మామయ్య లాంటివాడు అదిలించే వాడుండాలే కానీ అతడి మాటను శిలాశాసనంలాగా పాటిస్తారు.

నాన్న శవాన్ని వదిలిపెట్టి అమ్మను చుట్టుముట్టింది బంధు బలగం. ఏడ్చి ఏడ్చి అమ్మ సొమ్మ సిల్లిపోయింది.

'బంధువులొచ్చారు చూడు' అంటూ ఆమె నెవరో కుదిపారు.

మగతలోంచి తేరుకుని ఒకసారి చుట్టూ చూసి, కర్తవ్యం గుర్తుకువచ్చినట్లు భోరుమంటూ ఏడవడం మొదలుపెట్టింది.

మామయ్య ఎంత పని చేశాడు! ఊరుకున్నదాన్ని లేపి తిరిగి ఏడిపించాడు. ఘోరం. మరణం ఒక శాపమైతే ఆ మరణానికి దారుణాతి దారుణంగా విలపించడం అంతకంటే ఘోరమైన అభిశాపం.

ఈ రకంగా విలపిస్తూపోతే అమ్మకూడా బతకదు.

మురారి అదృష్టం బాగుంది. అమ్మ తిరిగి సొమ్మ సిల్లిపోయింది.

శవయాత్ర లగాయితు శవదహనం, తిరిగి ఇల్లు చేరుకోవడం, రకరకాల చాదస్తపు కర్మకాండలు, యావత్తు తతంగం మామయ్య చేతులమీదుగానే నడిచిపోయింది. నడిచిపోయిందనుకోవడం కంటే నడిపించుకుంటున్నాడు.

అమ్మ మూడోనాటికి కూడా తేరుకోలేదు.

అయినాసరే మామయ్య తన బాధ్యతలను వదులుకోలేదు. ''అక్కయ్యా, చిన్నదినం అంటే ఏదో విధంగా సరిపెట్టుకోవచ్చు. పెద్దదినం మాత్రం ఘనంగా చెయ్యాలమ్మా. నీకు వేరే చెప్పాలటమ్మా! పదిహేను, పద్దెనిమిది వేలయినా తప్పదుకదమ్మా. ఖర్చుగురించి చూచుకుంటామటమ్మా!'' రికార్డు పెట్టాడు మేనమామ.

అమ్మ తట్టుకోలేకపోయింది.

అటువైపు ఖర్చుకూ తట్టుకోలేదు. ఇటు తమ్ముడి గారి మాట తీసివేసి బంధువులవద్ద చిన్నతనమూ పొందలేదు.

ఏనాటిదో పాత ఇల్లొకటే ఉంది. ఆ ఇంటి మీదే అప్పు తీసుకురావాలి. లేదా అమ్ముకుని అద్దె ఇంట్లోకి వెళ్ళిపోవాలి. ఎలా? ఇంతకాలమూ ఆయన ఉండేవారు. కాబట్టి ఆర్థికపరమైన ఇబ్బందులను ఆయన చూచుకునే వారు. ఇప్పుడిదంతా మురారిమీద పడ్తుంది. మురారి చూస్తే నిరుద్యోగి.

ఒక చెల్లెలికి పెళ్ళి చెయ్యాలి. ఏం పెట్టి చేస్తాడు? తండ్రి ప్రయివేట్ కంపెనీలో పనిచేసేవాడు. ఉద్యోగం పూర్తయిపోయాక ఇక మృత్యువును చేరుకోవడమే! ప్రయి వేట్ కంపెనీలో ఇచ్చేది పని చేసే కాలంలోనే చాలేదికాదు.

ఉద్యోగం పోయాక ఇక చాలడమనే ప్రశ్న ఎక్కడిది? ఈలోపుగా ఆ బక్కజీవిని మృత్యువు కబళించింది.

ఈ సమస్య ఇలా ఉండగా మురారిని వేధించిన సమస్య వేరొకటి ఉంది. అది పూర్తిగా కుటుంబ సమస్య.

మురారికి రెండు రోజులు ఆలస్యంగా తెలిసిన సమస్య.

మురారి చెల్లెలి చేయి పట్టుకున్నాడట మామయ్య.

వాత్సల్యంతో కాదు; అభిమానంతో కాదు. తండ్రి అండ కూడా లేని అబల అనే చిన్నచూపుతో ఒళ్లు మడించి చేయి పట్టుకున్నాడు.

మురారికి రక్తం మరిగి పోయింది. దానితో మామయ్య ఇంట్లో లేనప్పుడు భీషణ ప్రతిజ్ఞలు చేశాడు. తల్లీ, చెల్లెలూ అతడి చేయి పట్టుకున్నారు.

''నాన్నగారి పెద్దకర్మ ఇంకా ముందుంది బాబూ! మనం కాస్త ఓపిక పట్టితీరాలి'' అంది తల్లి.

''ఎందుకమ్మా? ఎందుకని ఓపిక పట్టాలి? మన డబ్బు మన

ఇష్టం. మనకు ఎంతవరకూ వీలుంటే అంతవరకే దినకార్యాలు నిర్వహించుకుంటాం."

తల అడ్డం తిప్పింది తల్లి.

"లాభం లేదు బాబూ మనం భారీ యెత్తున దిన కార్యాలు నిర్వహిస్తా మని ఇప్పటికే మామయ్య ప్రచారం చేశాడు. మన ఎర్పాట్లేం బాగుండకపోయినా రాబోయే బంధుబలగానికి నచ్చ చెప్పలేం. ఈ సమయంలో వాడిని దూరం చేసు కోలేను. విరోధిని అంతకంటేనా.?"

మురారి ఖంగుతిన్నాడు.

చివరికి అమ్మకూడా మామయ్య పక్షమే అయిపోతుందని మురారి కలలో కూడా ఊహించలేదు. అందుకు కారణం కూడా తర్వాత క్రమంగా అర్థమయింది.

దినకార్యాలకు కావలసిన సాధన సంపత్తి సమకూర్చింది మామయ్యే. ఇల్లు తనఖా పెట్టు కుని అమ్మకు అప్పు ఇచ్చాడు.

దినకార్యాలైపోయిన సాయం కాలం కానీ మేనమామ కడుపులో ఉన్న ఊహ పూర్తిగా అర్థ మయింది కాదు మురారికి.

డబ్బును అడ్డం వేసుకుని చట్ట బద్ధంగా మేనకోడల్ని బుట్టలో వేసుకో వాలని మామయ్య పథకం. తల్లికి తన తమ్ముడి పథకం అర్థమైనాసరే అశక్తురాలై పోయింది.

మురారి ఆలోచించి ఆలోచించి చివరికి జూ పార్క్‌కి వచ్చాడు.

తన చెల్లెలి గురించి ఒకటే ఆలోచన. బుర్ర వగిలిపోయే ఆలోచనలు. బలికి పోయే పశువును తాను చూడలేదు. ఇప్పుడు చెల్లెలి బతుకు బలి పశువుకంటే తక్కువకాదు.

మామయ్యతో రెండో పెళ్లికి చెల్లెలిని ఒప్పించేలాగా ఉంది తల్లి. మామయ్యకు చిన్నకూతురి వయసుంటుంది చెల్లెలు.

అలాంటి చెల్లెల్ని ఎలా బలిపెట్టబోతుంది అమ్మ?

ఛీ.... ఛీ...ఈ ప్రపంచంలో బతకడం వృథా!

జూ పార్క్‌కి వచ్చాకనే ఆ ఆలోచన వచ్చింది మురారికి. వచ్చిన ఆలోచన కాస్తా క్రమంగా బల పడ్తోంది. తానా నిరుద్యోగి.

ఇప్పుడు నిలబడడానికి నీడ కూడా లేదు. పెద్ద దిక్కు మామయ్యే అవుతాడు.

ఛీ... ఛీ.. అంతకంటే చావు నయం. అలాంటి వాడు పెద్దదిక్కా?

భయంకరమైన అరుపు వినిపించింది. మురారి గతుక్కుమన్నాడు. ఆ అరుపు మనిషిది కాదు. మృగానిది. చారల మృగానిది. ఎక్కడినుండి వచ్చింది?

కూర్చున్న చోటు నుండి లేచాడు మురారి.

రోడ్డు దాటి చారల పిట్టగోడవద్ద నిలబడ్డాడు. మొక్కల తలలు పిట్టగోడకి ఇంచుమించు సమాంత రంగా ఉన్నాయి. మొక్కల మొదళ్లు అగాధం గోడల్లో ఉన్నాయి. చాలా విశాలమైన దిగుడు బావిలాగా ఉంది అగాధం.

లోతుగా ఉండి, ఆ లోతుప్రదేశంలో రకరకాల



బుర్ర పగిలిపోయే ఆలోచనలు. బలికిపోయే పశువును తాను చూడలేడు. ఇప్పుడు చెల్లెలి బతుకు బలిపశువు కంటె తక్కువ కాదు.

పిచ్చిమొక్కలూ, రాతిబండలూ, వాటి మధ్య ఒక నీటిచెలమా ఉన్నాయి. నీటిచెలమ అంచులో అంగుళం వ్యాసం గొట్టం ఎండ పడి మెరుస్తోంది.

అగాధం అవతలివైపు ఇనుప కటకటాలూ, చిన్న సైజు ఇల్లూ ఉన్నాయి. ఆ ఇంట్లోనుంచే చారల మృగం అరుస్తోంది.

కళ్ళు చికిలించాడు మురారి.

అతడి కళ్ళలో కనుపాపలు వికృతంగా కదిలాయి.

పిచ్చితనం పోవడానికి సంవత్సరాలు పట్టవచ్చు. సంభ వించడానికి మాత్రం క్షణం చాలు. తానిప్పుడు బండల మీదకి దూకి తల పగలకొట్టుకుని చచ్చిపోతే ఏమవుతుంది!

మురారి ఒంట్లో నరాలు ఝల్లు మన్నాయి. వింటి నారుల్లాగా గట్టి పడి మనిషి బిగుసుకుపోయాడు.

తన శవం దొరకగూడదు!

మురారి ఏమైపోయాడా అని ప్రపంచం విస్తుపోవాలి. ప్రపంచం కంటే ముందు అమ్మా, మామయ్యా కలసి నిర్ఘాంతపోవాలి. అవును....నివ్వెరపోయి వెంటనే మూర్ఛపోవాలి.

మురారి మాయమై పోవాలి. జనాభా లెక్కల్లోంచి, రేషన్ కార్డ్ పేజీలోంచి ఉన్నట్లుండి ఒకేసారి మాయమై పోవాలి.

అది చాలా సింపుల్. బండల మీద శవాన్ని చూసి ఊరు కుంటుందా పులి! ఊరుకోదుగాక ఊరుకోదు.

చివరి బొట్టుదాకా జుర్రు కుంటూ, చివరి బొమికె వరకూ నములుకుంటూ ఖాళీచేస్తుంది.

అందులోనూ మనిషి మాంసం గొప్ప రుచి అని చెప్పుకుంటారు.

మురారికి చాలా సంతోషంగా ఉంది. మనసు పట్టలేనంత సంతోషం! మెదడు నరాలు చిట్లిపోతా యేమో అనేటంతటి సంతోషం! ఒకసారి చుట్టూ చూసి చటుక్కున దూకేశాడు.

చారల పిట్టగోడ దాటి గాలిలో తేలుతూ చివరిసారిగా అను కుంటూ చూశాడు మురారి.

కటకటాల బోనుకు ఇవతల తొమ్మిదడుగుల పొడవున పసుప్ప చ్చటి చర్మంమీద నల్లటి బగ్గీలు ఎండపడి మిలమిల మెరుస్తున్నాయి. దాని ఆకుపచ్చ రంగు. కళ్లు మురారివైపే ఉన్నాయి.

'ఎంతసేపు! క్షణంలో తన తల పగిలిపోతుంది! మెదడును చప్పరిస్తుంది పులి! దట్సాల్!'

"మామయ్యా! ప్లీజ్, వదిలిపెట్టు మామయ్యా నేను అలాంటి దాన్నికాను మామయ్యా" ఏడుస్తోంది లత.

మామయ్య ఆమె చెయ్యి పట్టుకుని గదిలోకి నెట్టుకుంటూ పోతున్నాడు.

లత గింజుకుంటోంది.

గోళ్లతో అతడ్ని గిచ్చడానికి ప్రయత్నిస్తోంది. అరచి నలుగురి దృష్టినీ ఆకర్షించాలని లత గట్టిగా ప్రయత్నిస్తోంది.

మామయ్య పట్టు ఉడుంపట్టు. తాననుకున్నది సాధించే పట్టు. సాధించడానికి అతడికి చక్కటి అవకాశం కలసివచ్చింది.

చెల్లెలిని దైవపూజకు తీసుకువెళ్లారు బంధువులు. ఇంట్లో లతను ఒక్కర్తినీ వదలిపెట్టి వెళ్లింది తల్లి.

కొత్తగా ప్రాప్తించిన వైధవ్యం ఆమెకు ఎంత లోటు సమకూర్చిపెట్టింది.! ఏం చేయాలో, ఏం చేయకూడదో తెలియని పరిస్థితి. ప్రజ తనను ప్రత్యేకంగా గుర్తు పడ్తోంది.

"అమ్మ వస్తుంది. అంతా చెప్పేస్తాను." లత గొంతు పెగుల్చుకోలేకపోతోంది. మామయ్య చేయి ఆమె

గొంతుని అదేపనిగా అదిమిపెడ్తోంది.

గడప దాటించి డబుల్ కాట్‌మీదికి తోశాడు మామయ్య.

తుపాకీ దెబ్బ తిన్న లేడిలాగా వణకి పోతోంది లత.

చటుక్కున చేతులు జోడించి, "మామయ్యా నన్ను క్షమించు మామయ్యా. నీ కూతురిలాంటిదాన్ని మామయ్యా. నేను, సుభాకర్ కలసి పెళ్లి చేసుకోవాలనుకున్నాం మామయ్యా. ప్లీజ్... నన్ను వదిలిపెట్టు మామయ్యా" అంది లత.

మామయ్య కనికరించదల్చుకోలేదు.

కనికరించడానికేనా ఇటువంటి మహత్తరమైన అవకాశాన్ని కల్పించుకున్నది? లత మీద పడి చేయగలిగినంత బీభత్సకాండ చేయడానికి నాందీప్రస్తావన పలుకుతున్నాడు.

"అమ్మా.... అన్నయ్యా," అరుస్తోంది అబల.

ఆమెకు తెలియదు అన్నయ్య పులి ఉండే అగాధంలోకి ప్రయాణం చేస్తున్నాడని.

మెదడుకు రెండు భాగాలుంటాయి కాబోలు. ఒక భాగం 'ఎస్' అంటే రెండోది, 'నో' అంటుంది. మురారి ఆత్మహత్యకు రెండు భాగాలూ కలిసి సహజంగానే 'ఎస్' అనలేదు. ఫలితంగా అతడి చలనదశలో మార్పు సంభవించి చేతులు ముందుకు పోయాయి.

బండమీదకు గురి చూసి తలకిందులుగానే దూకాననుకున్నాడు మురారి.

గాలివేగం, అతడి అంచనా తప్పడమూ, శరీరం బరువూ, చలనదిశే కాకుండా దశ కూడా మారడమూ మురారిని అయిదారంగుళాల దూరం అటూ ఇటూగా నేలమీద పారేశాయి.

నేలమీదికి చేరుకునే లోగా ఎన్నో ఆటంకాలు.

అగాధం అంచుల్లో పిచ్చి మొక్కలతోపాటు అల్లిబిల్లిగా పెరిగిన పిచ్చి తీగలు. శతాబ్దాల తరబడి భూమిలోని సారాన్నంతటినీ పీల్చి రాక్షసజాతిగా తయారైన గందరగోళపు తీగలు.

అవే తీగలు మురారికి స్ప్రింగులమీద పడిన భ్రమని ఇచ్చాయి. ఒకసారి తిరిగి గాల్లోకి లేచి తీగల జుంపాలమీద పడి ఊయలలో పడుకున్న భంగిమలో ఆగిపోయాడు.

కొన్ని నిమిషాల వరకూ అదే స్థితిలో ఉండిపోయాడు మురారి.

తన పరిస్థితి ఏమిటో స్పష్టంగా అర్థమయ్యేటప్పటికి మురారి కళ్లు విచ్చుకున్నాయి.

ఒకసారి చుట్టూ చూశాడు.

ఎగుడు దిగుడుగా కత్తిరించిన చపాతీలాగా ఉంది ఆకాశం. చపాతీ అంచులలో మొక్కల తలలు గాలికి ఊగుతున్నాయి.

తాను ఎలా బతికాడు? అసలింకా ఎందుకు బతికున్నాడు?

తీగల జుంపాల మీద లేచి కూర్చున్నాడు. అగాధం అడుగు భాగం అక్కడికి ఇక ఎంతో దూరం లేదు. దూకి చచ్చిపోదామనుకున్నా ప్రయోజనం లేదు.

తీగల జుంపాల మీద నుండి బండరాతి మీదికి అడుగు వేశాడు. అడుగు జారింది.

మురారికి గుండె లటుక్కు మంటూ జారిపోయింది.

తల్చుకుంటే మురారికి విచిత్రంగా ఉంది.

**అగాధం పైఅంచులోంచి కేకలు వినిపిస్తున్నాయి. "ఓయ్ ఎవరయ్యా నువ్వు? పులి ఉన్న ఎన్‌క్లోజర్‌లోనే దూకుతావా? చావాలనా బతకాలనా?"**



ఇందాక మృత్యువంటే భయపడలేదు. ఇప్పుడు కాలు బెణుకు తుందేమోనని బెదరిపోయాడు. ఎంత చిత్రమైనదీ మానవ మస్తిష్కం!

మురారి నవ్వుకుంటూ నెమ్మదిగా బండమీదికి చేరుకున్నాడు.

తన పిచ్చికానీ? చచ్చి ఏం సాధిస్తాడు. ఏమీలేదు. మామయ్యకు ఆపాటి అడ్డం కూడా తప్పుకుంటుంది.

మామయ్య ఇకమీదట ఆడింది ఆట, పాడింది పాట. తాను బతికే ఉండాలి. పిరికి వాడిలాగా పారిపోయి చచ్చిపోరాదు.

బాగానే ఉంది. శ్మశాన వైరాగ్యం అంతమయింది. ఇప్పుడు అగాధం అంచులకు చేరుకోవాలి. ఎలా?

తీగలను పట్టుకుని కొంత వరకు పాకవచ్చు. ఎక్కడైనా చెయ్యి జారడమో, తీగ తెగడమో జరిగితే..... ఏమైనా ఉందా? అంచుకు చేరుకోవడానికి దారి వెతుక్కుంటూ చుట్టూ తిరుగుతూ నిలబడిపోయాడు.

మురారి కాళ్లు నేలలోకి పాతుకుపోయాయి.

మిలమిల మెరిసే ఎండలో పసుప్పచ్చటి చర్మం మీద నల్లటి బగ్గీలు.

మురారికి తల తిరిగిపోయింది.

బోనులోంచి బయటపడి అగాధం వైపు నిలబడింది పెద్దపులి.

రెండడుగులు దిగి బండమీద ఆగింది. మూతి ముడిచి, మీసాలు కదిపి మెడ చాపి చూస్తోంది.

తన కళ్లముందే తన గుండె తెగిపోయి అగాధం అంచులలో దొర్లిపోతోంది. మెదడు చీలికలై వేడికి కరిగిపోయే నెయ్యిలాగా బండలమీద పారుతోంది. నరాలు ఉంగలు చుట్టుకుపోయి ఎక్కడికక్కడ ఫట్ ఫట్‌మని తెగిపోయి తిరిగి అతుక్కుంటూ ముళ్లకంచెల్లాగా తయారవుతున్నాయి.

రక్తం మంచు లాగా చల్లబడిపోయి పులి తాగే నీటిచెలమలాగా మారిపోతోంది.

మురారి కుప్పకూలిపోయాడు.

తాను చచ్చిపోవడమంటూ జరిగితే అటు తర్వాత పులి తిన్నా మేక తుమ్మినా రెండూ ఒకటే. కానీ..... ఇప్పుడు..... ఘోరం... బతికుండ గానే పులి తనమీద పడ్తుంది. పంజా విసరి పదునైన గోళ్లతో చంపేస్తుంది.

అయిపోయింది. తన బతుకు ఇంత దారుణంగా ముగిసిపోతుందను కోలేదు.

నిరుద్యోగి బతుకు మాత్రమే అనుకున్నాడు. చివరికి పులి వంటి క్రూర జంతువు కడుపు చీల్చి, మెడ కొరికి, నెత్తురు పీల్చి, కండలను కొరికి, ఎముకలను పరపరా నమి లేస్తుందని అనుకోలేదు.

అతడి మెదడు ముక్కలయ్యేలాగా పులి భయంకరంగా గాండ్రించింది.

ఎలా అడుగువేశాడో, ఎలా తీగలందుకున్నాడో అగాధం గోడ అంచునే ఎగబాకుతున్నాడు మురారి. మధ్య మధ్య తీగలు తెగిపోతున్నాయి.

గోడ అంచునే బండలమీద పాదాలు జారిపోతున్నాయి. మట్టిలో కాలివేళ్లు కూరుకు పోయి



కిందికి జారిపోతున్నాడు.

పులి మరోసారి అరిచింది. ఈసారి అరుపు అతడికి బాగా దగ్గరగా వినిపించింది. మురారి బిక్కు బిక్కు మంటూ వెనక్కి తిరిగాడు.

అగాధం మధ్యలో బండమీద నిలబడింది పులి.

ఆయిపోయింది మరొక్క క్షణం! అగాధం గోడకి ఒక్క ఎగురు ఎగిరి పులి తనను అందుకుంటుంది. నరాల పట్లు సడలిపోయి వెనక్కి పడ్డాడు మురారి.

అగాధం పై అంచులోంచి కేకలు వినిపిస్తోన్నాయి.

"ఓయ్ ఎవరయ్యా నువ్వు! పులి ఉన్న ఎన్‌క్లోజర్‌లోనే దూకుతావా? చావాలనా బతకాలనా?"

"హేయ్...హేయ్...హేయ్...ఆ ఆ అరరె...పులి ఎలా వదుల్తుందయ్యా"

మరే...నోటికందితే ముద్దెట్టుకుంటుందా, అందులోనూ పెద్దపులి, అది వదుల్తుందా?, హేయ్. ఎయ్..తప్పుకో..ఆయ్.. నువ్వొచ్చెయ్యవయ్యా, పైకి ఎలాగో పాక్కుంటూ వచ్చెయ్."

మురారికి ఎటూ తోచడంలేదు.

దూకినంత సులువా అగాధం పైకి చేరుకోవడం. కాదు కాదు కాదు, అతడి ఆలోచనల్లో అతడుండే ఆ సమయంలో -

మురారి ఇంట్లో అతడి చెల్లెలి మీద మృగం లాంటి మనిషే పడ్డాడు. ఆమె లావణ్యాన్ని అందినచోటల్లా జుర్రుకోవాలని ఆ మృగం తాపత్రయపు దోబూచులాట మధ్యలో ఆమె సిగ్గు క్రమంగా రోషంగా మారుతోంది.

ఎలా శక్తిని కూర్చుకుందో అతడిని ఒక్క గెంటు గెంటింది. మేనమామ కింద పడ్డాడు. కుయ్ మంటూ మూలిగాడు.

మంచం మీదనుండి లేచి పరు గెత్తబోయింది ఆ కన్నెపిల్ల.

చెయ్యి చాపి మేనమామ ఆమె పరికిణీ అందుకున్నాడు. ఆమె యిక వెనకా ముందూ చూడదల్చుకోలేదు. పాదం ఇనుపపాదమే అయింది.

అది కాస్తా మేనమామ మొహం మీద పెయ్యి పిడుగుల శక్తితో పడిపోయింది.

అతడి చెక్కిలి ఎముక విరిగిందో, వయసు పండిపోయిన దంతాలే విరిగి పోయినాయో తెలిసే లోగా మేనమామ తన చేతిలోంచి పరికిణీని విడిచి పెట్టాడు.

ఆమె ఆగలేదు. ఇంట్లోంచి బయటికి పరుగెత్తింది. రోడ్డు మీద గంటలకారు వెళ్తోంది.

ఆ కారు ఎక్కడికో ఆమెకు తెలియదు. తెలిసి వుంటే మరింత కంగారు పడిపోయి ఉండేది. లత పిక్కసత్తువకొద్దీ పరుగెత్తుతోంది.

కథ క్లయిమాక్స్‌కి చేరడానికి ఆమె పరుగే కారణం.

అగాధం అంచుచుట్టూ మనుషులు చేరారు. తండోపతండాలుగా, తేనెతుట్టెలో చేరినట్టూ మనుషులు!

రకరకాల నిట్టూర్పులూ, శాపాలూ, ఓదార్పులూ,

**మంచంమీద నుండి లేచి పరుగెత్తబోయింది ఆకన్నె పిల్ల. చెయ్యి చాపి మేనమామ ఆమె పరికిణీ అందుకున్నాడు.**

సలహాలూ, సంప్రదింపులూ మధ్యమధ్య పులికి అదిలింపులూ.

పెద్దపులి వీటిని పట్టించుకోవడంలేదు. బండ తర్వాత బండ వంతున దూకుతూ మురారిని సమీపించింది. నిలుచుని తేరిపార చూసింది. మీసాలతో ఒకసారి అతడిని వాసన చూస్తోంది.

మురారిలో నవనాడులూ కుంగిపోయాయి.

ఒళ్లంతా తడిసిపోయి చెమటతో ముద్దయి పోయింది. తీగలు వదిలిపెట్టి నిర్వికారంగా చూస్తూ, అగాధం అంచున నిల బడిన వాళ్ల పొలికేకలు వింటున్నాడు.

ఒకరిద్దరు ప్రబుద్ధులు పులిని ఎదుర్కోమని కూడా సలహా ఇస్తున్నారు. పులిని ఎదుర్కోవడ మొకటా! డిఫెన్స్‌కే ధైర్యంలేదు పైగా అఫెన్స్ ఒకటా!

"పక్కకి తప్పుకోండి..ఏంటయ్యా చూస్తారు... చోద్యంలాగా...కదలండి కదలండి!"

మురారికి ఒక ప్రక్క పెద్దపులి, రెండోవైపు తాళ్ళ నిచ్చెన.

మురారి భుజానికి తగుల్తోంది తాళ్లనిచ్చెన. కానీ ఎక్కడం ఎలా? ఏమాత్రం వెనుదిరిగినా పులి తన మెడ పట్టుకుంటుంది.

"పట్టుకోవయ్యా....నిచ్చెన ఎక్కు. కమాన్! క్విక్ పులి నిన్నేమీ చేయదు." అరుస్తున్నాడు జూ సంరక్షణాధికారి.

పులి గాండ్రింపు కంటే కర్కశంగా ఉంది అతడి గొంతు.

అతడే మరలా అరిచాడు.

"హెయ్...వెళ్లు...బోనులోకి."

పులి ఒకసారి మెడ పైకెత్తి జనాన్ని చూసింది. దానికేమీ అర్థం కాలేదు. జనం ఎందుకు గుమి కూడారు? అగాధంలో మనిషిని ఎందుకు పడవేశారు? తినమనా! మురారి తాళ్లనిచ్చెన అందుకున్నాడు.

పులివైపే చూస్తూ రెండు చేతులతో పట్టుకుని ఒక కాలిని మెట్టు మీద ఉంచాడు మురారి. పది నిమిషాలపాటు సాగిన సాహచర్యంలో పులి అతడికి కొత్తగా ఉన్నట్లు తోచడంలేదు.

అంతే! చకచక మెట్లెక్కేశాడు. అతడి ప్రమేయం లేకుండా తాడు పైకి లేస్తోంది. "ఔరా డింభకా!" అన్నట్టు చూస్తోంది పులి.

అగాధం అంచుల్లో జయజయధ్వానాలు. హర్షాతిరేక ధ్వనులు! మురారిని నలుగురూ కలసి అగాధం బయటికి సాయం పట్టేశారు. జనం అతడ్ని చేరుకోవడానికి కాళ్లు విరగదొక్కు కుంటున్నారు.

పోలీసులూ, జూ ఉద్యోగులూ, అగ్ని మాపకదళ సిబ్బందీ కలసి జనంలోంచి మురారిని ఇవతలకి తీసుకువచ్చారు. చెట్టు కింద అతడికోసం రెండు ప్రాణులు ఎదురు చూస్తున్నాయి. తల్లి, చెల్లెలు.

ఇద్దరి కళ్లలో కన్నీటి కడవలు. ధారాపాతమైన కన్నీళ్లు. మురారిని చెరోవైపూ వాటేసుకుని భోరు మంటూ ఏడుపు లంకించుకున్నారు.

గుండె బరువు తీర్చేది కన్నీరే. ఎవరు కాదంటారు?

కన్నీటి ధారల మధ్య అంటోంది చెల్లెలు:

"చచ్చిపోదామనుకున్నావా అన్నయ్యా... ఏంరా...ఎందుకురా చచ్చిపోవడం! ఈ మాత్రం సమస్యలకేనట్రా చచ్చిపోవడం....ఛ...తప్పురా. ఎదిరించాల్రా. పులుల్లాంటి మనుషుల్నే ఎదిరించి బతికించాల్రా నీ కుటుంబాన్ని." మురారి ఇప్పుడు ఏడవడంలేదు. నవ్వుకుంటున్నాడు.

పిచ్చిగా కాదు. బతుకుమీది ఆశతో.

తాజాగా చిగురించిన సరికొత్త ఆశతో.

అవును, తాను పులి నోట్లోంచి తప్పించుకోలేదూ!